క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



పెడన: 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్ బాబు తన తల్లి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడూరు రోడ్డులోని రైలు గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్ పాదచారులకు మజ్జిగ అందించి నిర్వాహకులను అభినందించారు. కడప బాషా, హఫీజ్, గోపీ, శ్యామలరావు పాల్గొన్నారు.

● ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల బ్యాంకు సెంటర్‌లో గ్రామానికి చెందిన దోనేపూడి నవీన్ చౌదరి, కె విఠల్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు తీవ్రత అధికమవడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. రెండు రోజుల నుంచి స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న వీరిని పలువురు అభినందించారు. కాకుమాని రంగారావు, గొర్రెపాటి రాజేష్ పాల్గొన్నారు.

అన్నసమారాధన



కోనేరుసెంటర్: చిలకలపూడిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు వెంట్రప్రగడ ప్రసాద్, తోట శ్రీనివాసరావు, చలమలశెట్టి చిన్ని, రాంబాబు, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

మెరకనపల్లి జట్టుపై అవనిగడ్డ బి జట్టు విజయం



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం మెరకనపల్లి జట్టుపై అవనిగడ్డ బి జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అవనిగడ్డ బి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన మెరకనపల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 50 పరుగులు మాత్రమే చేసిందని నిర్వాహకులు తెలిపారు. అవనిగడ్డ బి జట్టులో ప్రతిభ చూపి 25 పరుగులు చేసి, రెండు వికెట్లు తీసిన పవన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించిందని నిర్వాహకులు యన్నం హరి, యన్నం నరేష్ తెలిపారు.

స్వామివారి సన్నిధిలో బాపట్ల డీఎంహెచ్ఓ



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బాపట్ల జిల్లా డీఎంహెచ్ఓ విజయమ్మ మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమె నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు.

పింఛనుదారుల వితరణ



మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన సామాజిక పింఛను లబ్ధిదారు అబ్దుల్ బీబీజాన్ మే 11వ తేదీన మృతిచెందింది. డివిజన్‌లోని సామాజిక పింఛన్ల లబ్ధిదారులు ఒక్కొక్కరూ రూ. 100 చొప్పున సేకరించగా వచ్చిన రూ. 35,600 మొత్తాన్ని మృతురాలి కుమారుడు అబ్దుల్ ఇక్బాల్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, డివిజన్ కన్వీనర్ షాహెదాబేగం, వలంటీర్ ప్రసన్న, గృహ సారథులు ఖయ్యూం, అచ్చెయ్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన

మండవల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో పిల్లలకు కంప్యూటర్ బేసిక్స్, కంప్యూటర్ ప్రయోజనాలు, ఏయే సమయాల్లో ఏవిధంగా వినియోగిస్తారనే విషయాలపై గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ బేసిక్స్ నాలెడ్జ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రంథాలయ విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్మీ కంపోస్టు వరం



నాగాయితిప్పలో సిద్ధంగా ఉన్న వానపాముల ఎరువు



మోపిదేవిలో సంపద తయారీ కేంద్రం

- సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు
- తగ్గుతున్న పెట్టుబడి ఖర్చులు, పెరుగుతున్న దిగుబడులు
- రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

మోపిదేవి: సాగులో సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరుగుతుంది. రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయి. సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. దీంతో వీటి ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది.

ప్రభుత్వ ప్రోత్సాహం

రైతులను ప్రకృతి సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నేటి పోటీ ప్రపంచంలో అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువుల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రభుత్వం హెచ్చరిస్తోంది. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రతి పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద కేంద్రం (సాలిడ్ హెల్త్ ప్రాసెసింగ్ సెంటర్) ఎస్‌డబ్ల్యూపీసీ ఏర్పాటు చేసి అటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చడంతో పాటు ఇటు గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017లో కేంద్రప్రభుత్వంతో టైఅప్‌అయి స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం 90 శాతానికి పైగా అమల్లోకి వచ్చాయి. మండలంలో కొన్ని పంచాయతీల్లో ఊపందుకున్నాయి.

సేంద్రియ ఎరువుల తయారీ..

గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి హరిత రాయబారులు (గ్రీన్ అంబాసిడర్స్)వాహనాల ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీకు తరలిస్తారు. తడి చెత్తలో వానపాములను వదిలి కొంతకాలం తరువాత సేంద్రియ ఎరువుగా తయారు చేస్తారు. అన్ని సమయాల్లో ఏ పంటలకైనా ఈ ఎరువు వేయడం ద్వారా మంచి దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొడి చెత్తలో ప్లాస్టిక్ సంచులు, సీసాలు వగైరా వేరుచేసి అమ్మకాలు చేస్తారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు వేతనాలు 2023 మార్చి వరకు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చెల్లించారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రీన్ అంబాసిడర్స్‌కు పంచాయతీలే వేతనాలు చెల్లిస్తున్నాయి. సేంద్రియ ఎరువుల తయారీకి పంచాయతీ వారు మరింత శ్రద్ధ తీసుకుంటే ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా ప్రజలకు అందించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

తైవాన్ జామ మంచి దిగుబడి వచ్చింది



తైవాన్ జామ సాగు చేశా. వానపాముల ఎరువును మొక్క మొదల్లో వేసి నీరు పెట్టా. ప్రతి మొక్కకు ఈ ఎరువు వేశా. మంచి రంగు వచ్చి, దిగుబడి కూడా పెరిగింది. మిగతా రసాయనిక ఎరువుల వాడకం ఆపి, జామతోటకు సుమారు 8 క్వింటాళ్లు వానపాముల ఎరువునే వాడా. మార్కెట్‌కు వెళ్లకుండానే చుట్టుపక్కల నుంచి చిరువ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారం ఆశాజనకంగానే ఉంది.

– ముమ్మనేని బాబూరావు, కొక్కిలిగడ్డ

వరి, మినుము పంటకు వాడా



మాగాణి భూముల్లో వరి, మినుము పంటకు వానపాముల ఎరువు వాడా. మంచి దిగుబడి వచ్చింది. పెరట్లో పూల మొక్కలు, మామిడి మొక్కలకు వాడా. పూత, కాయలు బాగా నిలిచి ఫలితాలు చాలా బాగున్నాయి. ప్రైవేటు నర్సరీల్లో కిలో రూ. 7 ఉండగా పంచాయతీల వద్ద కిలో రూ. 10లకు అమ్ముతున్నారు. దీని ధర కూడా తగ్గించి రైతులను ప్రోత్సహించాలని కోరుతున్నా.

– నాదెళ్ల శరశ్చంద్రబాబు, పెదప్రోలు

జగన్ పాలనలో అన్నివర్గాలకు మేలు

- పేర్ని కిట్టు
- కానూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి పథకాల లబ్ధిని వివరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని కానూరు గ్రామంలో మూడో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాలను ఆయన వివరించారు. స్థానికురాలు వీర దమయంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని తమ కుటుంబంలో పెన్షన్‌తో పాటు పలు పథకాలు అందుతున్నాయని, తద్వారా తమ కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తొలిగాయని ఆనందం వ్యక్తం చేసింది. కిట్టు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మారుమూల గ్రామాలకు సైతం ప్రభుత్వ సేవలు ఉపయోగపడాలనే మంచి ఆలోచనతో సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారన్నారు. వ్యవసాయ పరంగా రైతులకు ప్రభుత్వ సేవలు దోహదపడాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. అన్నివర్గాల మేలు కోరే సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైఉండి ప్రభుత్వ ఫలాలు అందని గ్రామస్తులు ఎవరైనా ఉంటే వివరాలు తెలియజేయాలని కోరారు. వెంటనే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కా లక్ష్మి ఉప సర్పంచ్ గోపు మురళి, గ్రామ ఇన్‌చార్జి చెక్కా ఏడుకొండలు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపాబత్తుల చూడామణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శర్మిష్ట

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఐదు సంవత్సరాలు లోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శర్మిష్ట అన్నారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తూ, జింక్ ట్యాబ్లెట్స్ గురించి ప్రతి ఇంటా వివరించాలని సూచించారు. పర్యావరణం, వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి మందుల వివరాలు, సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ డాక్టర్ హారిక, డాక్టర్ శ్రీరామ్ సాయి, రాధా, సారథి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అగ్నిమాపక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మాక్‌డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య, సిబ్బందికి అగ్నిమాపక అధికారి వివరించారు. ప్రమాద సమయంలో ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాయకస్వామి పవళింపు సేవ

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామి వారి పవళింపు సేవ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన, రాత్రికి పవళింపు సేవ ఉత్సవం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

ఉరుసు ఉత్సవాలకు ఎమ్మెల్యే రూ.50 వేల విరాళం



ఎమ్మెల్యే నాని ఇచ్చిన రూ.50 వేలను దర్గా పెద్దలకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడరూరల్: మండలంలోని మల్లాయపాలెంలో జరుగుతున్న హజరత్ సయ్యద్ సాలార్‌షా ఔలియ ఖాదరి ఉరుసు మహోత్సవాలకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రూ.50 వేలు కానుకగా సమర్పించారు. ఎమ్మెల్యే నాని సమకూర్చిన నగదును వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదరీబాబా దర్గా పెద్దలకు మంగళవారం అందజేశారు. దర్గా అభివృద్ధికి దశాబ్దన్నరకుపైగా ఎమ్మెల్యే కొడాలి నాని అందిస్తున్న సహకారం మరువలేనిదని దర్గా పెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల శ్రేయస్సు, ముస్లిం ప్రార్థనా మందిరాలు, పవిత్ర దర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే కొడాలి నాని ప్రభుత్వ పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బాబావారీ ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలతో పాటుగా ఎమ్మెల్యే కొడాలి నాని సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఖాదరి బాబా దర్గా పెద్దలు యాకూబ్, అఫ్జల్‌బేగ్, అమీన్‌బేగ్, మెయిన్‌బేగ్, అబ్దుల్ తాజుద్దీన్, మైనార్టీ సెల్ నేతలు సాలెహా ఎండీ, షేక్ రజాక్‌భాష, షాకిర్ పాల్గొన్నారు.

అదనపు బోరు, పైపులైన్ ఏర్పాటుకు చర్యలు

రామకోటిపురం(అవనిగడ్డ): మండల పరిధిలోని రామకోటిపురంలో రూ.5 లక్షల వ్యయంతో అదనపు బోరు, పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీపీ తుంగల సుమతీదేవి చెప్పారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన ఎంపీపీ దృష్టికి స్థానికులు పలు సమస్యలు తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి సరఫరాను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. లక్ష్మీతిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఊట బావులకు మరమ్మతులు

కోనేరుసెంటర్: ఎస్ఎన్ గొల్లపాలెంలో మంగళవారం ఊట బావులకు మరమ్మతులు చేశారు. వేసవి దృష్ట్యా గ్రామస్తులకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మాజీ సర్పంచ్ మట్టా మోహన్ నాంచారయ్య దగ్గరుండి ఊట బావులకు వెల్ల వేయించారు. గ్రామంలోని 22 బావులకు వెల్ల వేయించిన అనంతరం నీరు పరిశుభ్రంగా ఉన్నది లేనిది పరిశీలించారు. ఈ సందర్భంగా నాంచారయ్య మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామస్తుల కోరిక మేరకు బావులకు వెల్ల వేయించామన్నారు. దీనికి సహకరించిన యువ నాయకుడు పేర్ని కిట్టుకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాల అభివృద్ధి

మండవల్లి: గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు దోహదం చేస్తున్నాయని ఇన్‌చార్జి ఏపీఓ ఎన్ నవీన్ పేర్కొన్నారు. మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామంలో రూ.1.20 లక్షల అంచనా విలువతో పంటబోదె అభివృద్ధి పనులను మంగళవారం 67 మంది ఉపాధి కూలీలు నిర్వహించినట్టు చెప్పారు. ఫీల్డ్‌అసిస్టెంట్,మేట్‌లు పాల్గొన్నారు.

జెడ్పీటీసీలకు శిక్షణ తరగతులు

గూడూరు: బాపట్లలోని ఈటీసీ (విస్తరణ శిక్షణా కేంద్రం)లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు పెడన నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్ రంగబాబు, మలిశెట్టి వెంకటరమణ, మైలా రత్నకుమారి హాజరయ్యారు. ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని జెడ్పీటీసీ సభ్యులకు ప్రభుత్వం ఈనెల 5 నుంచి 7 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, బంటుమిల్లి, కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, మైలా రత్నకుమారిలు రెండో రోజు శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్నారు. శిక్షణ తరగతుల్లో అనేక విషయాలు తెలుస్తున్నాయని, బుధవారంతో శిక్షణ తరగతులు ముగియనున్నాయని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు వివరించారు.

ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఏడు వేల మందికి అన్నసమారాధన



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం రాత్రి కల్యాణమూర్తులకు పవళింపు సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివార్లకు ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో వాయిద్యాన్ని వాయిస్తూ కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపారు. అనంతరం పుష్పపరిమళాల నడుమ స్వామివార్లకు పుష్పయాగాన్ని నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని మంగళవారం ఉదయం వెంకన్న మూలమూర్తులకు విశేష అలంకారం చేశారు. చెరకు కర్రలతో గర్భాలయాన్ని అలంకరించారు. అనంతరం ఏడు వేల మందికి మహా అన్నసమారాధన నిర్వహించారు. దివిసీమలోని అన్ని ప్రాంతా లకు చెందిన భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిప్పుల కొలిమిలా బందరు



నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



గాంధీబొమ్మ శివాలయం సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో మంగళవారం భానుడు ప్రతాపం చూపాడు. నగరం నిప్పుల కొలిమిని తలపించింది. 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావటంతో ఎండ వేడికి ప్రజలు తల్లడిల్లారు. అధిక ఎండకు వడగాడ్పులు తోడవడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం నుంచే అధిక ఎండ కాయడంతో సాయంత్రం వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రాత్రి 7 గంటల వరకు వేడిగాలులు వీచాయి. ఉదయం 10 గంటల్లోగా పనులు పూర్తి చేసుకుని ప్రజలు ఇళ్లకు చేరుకున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లే వారు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మజ్జిగ, శీతల పానీయాలు సేవించి సేదతీరారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు శిక్షణ



చిలకలపూడి గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు సరస్వతి పూజ చేసి భగవద్గీత శ్లోకాలు పఠించారు. పుస్తకాలు చదవగా ఉపాధ్యాయులు కథలు చెప్పారు. పలు ఆటలు ఆడించారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయిని అల్లాడ శ్యామల పాటల పోటీలు నిర్వహించారు. శేషగిరి మాస్టర్ విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించారు. సూర్యనారాయణమూర్తి శ్లోకాలు నేర్పారు. విద్యార్థిని ఎ. కిరణ్మయి పుట్టినరోజును ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమాలను జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు. చిలకలపూడి గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పత్రికలు చదివించారు. చిలకలపూడి, ఈడేపల్లి శాఖ గ్రంథాలయాల అధికారులు డి. సుబ్రహ్మణ్యం, కోన వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు

అవనిగడ్డ: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ అప్పికట్ల సీతారామ్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు నైతిక విలువల గురించి తెలియజేశారు. ఆధ్యాత్మిక గురువు మత్తి శేషగిరిరావు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. దేశభక్తి గీతాల పోటీల్లో ప్రథమ బహుమతి వి. రోహిత్, రెండవ బహుమతి స్వాతి, మూడవ బహుమతి డి. నాగలక్ష్మీ గెలుపొందగా గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ పర్యవేక్షించారు.

ఘంటసాలలో..

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల ప్రధాన గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పుస్తకాలు చదవడం, డ్రాయింగ్ వేయడం, యోగా నేర్పించడం, మ్యూజికల్ చైర్స్ ఆడించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను గ్రంథాలయ అధికారి ఎం. శరత్‌కుమార్ పర్యవేక్షించారు.

పంచాయతీ కార్యాలయం పరిధిలో 69 మంది బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో ఆయా క్యాడర్ల వారీగా 69 మందిని బదిలీ చేస్తూ కలెక్టర్ పి. రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియ ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారం నిర్వహించారు. ఐదేళ్లు పైబడిన వారు ఆయా క్యాడర్ల వారీగా 17 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో నలుగురిని అదే స్థానంలో ఉంచారు. మిగిలిన 13 మందిని బదిలీ చేశారు. రెండేళ్లు పైబడిన వారు ఆయా క్యాడర్ల వారీగా 57 మంది దరఖాస్తు చేసుకోగా 43 మందిని బదిలీ చేశారు. 14 మంది దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోలేదు. పరిపాలనా సౌలభ్యం కోసం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు ఏడుగురిని, గ్రేడ్-3 ఐదుగురిని, సీనియర్ అసిస్టెంట్ ఒకరిని బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియ పూర్తి చేశామని డీపీఓ నాగేశ్వర నాయక్ వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని మునిసిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు కోరారు. ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న ప్రచార జాతా మంగళవారం సాయంత్రం మచిలీపట్నం కోనేరుసెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీఐటీయు నగర ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, విశాఖ, ఎన్టీఆర్ జిల్లా నాయకులు నూకరాజు, విజయలక్ష్మీ, నాయుడు పాల్గొన్నారు.